మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే వివేకానంద్



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లి డబుల్ బెడ్ రూమ్ సముదాయం నుంచి సికింద్రాబాద్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్, మంచినీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, బస్సు సౌకర్యం వంటి వసతులు కల్పించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని తెలిపారు. త్వరలోనే అన్ని మౌలిక వసతులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం బస్సులో నాయకులు, ప్రయాణికులతో కలిసి ఎమ్మెల్యే ప్రయాణించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, సాయి యాదవ్, ఆనంద్ కుమార్, బౌరంపేట బ్యాంక్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్లు అర్కల జీతయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, నేతలు కొల్తూరు మల్లేష్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం కొంపల్లి జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించారు. తాగునీటి సదుపాయం సరిగా లేదని, ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్, కిచెన్ గదిని సమకూర్చాలని విద్యార్థులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లలో తాను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేశానని, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, కౌన్సిలర్లు వినోద్, రవీందర్, సువర్ణ, దేవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకులకు వేళాయె..!

- ముస్తాబవుతున్న పునీత ఇన్యాషివారి చర్చి
- చర్చిలో ఒకేసారి 500 మందికి పైగా ప్రార్థనలు చేసుకునే అవకాశం
- ప్రత్యేక ఆకర్షణగా ఏసుక్రీస్తు, మేరీమాత, బాలఏసు ప్రతిమలు
- 25న ప్రత్యేక ప్రార్థనలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు



పునీత ఇన్యాషివారి చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు జనన దృశ్యాలు..



విద్యుత్ కాంతుల్లో పునీత ఇన్యాషివారి చర్చి

దుండిగల్: తెలంగాణ రాష్ట్రంలో పెద్ద చర్చిగా పేరొందిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చర్చి గాగిల్లాపూర్‌లోని 'పునీత ఇన్యాషివారి దేవాలయం' చర్చిలో క్రిస్మస్ వేడులకు ముస్తాబు అవుతోంది. మొదట్లో గాగిల్లాపూర్ గ్రామంలో గుడిసెలు వేసుకుని అందులో ఏసుక్రీస్తు బొమ్మలను ఏర్పాటు చేసి ప్రార్థనలు చేసేవారు. కాలక్రమేణా 1974 సంవత్సరంలో గ్రామస్తుల సహకారంతో గాగిల్లాపూర్‌లో పునీత ఇన్యాషివారి చర్చి రూపుదిద్దుకుంది. నాటినుంచి నేటి వరకు చర్చిలో ప్రార్థనలు కొనసాగుతున్నాయి. ఈ చర్చికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో 2008 డిసెంబరు 3న మరో చర్చి నిర్మాణానికి రూపకల్పన చేశారు. సుమారు 11 ఎకరాల విస్తీర్ణమున్న స్థలంలో 110 ఫీట్ల ఎత్తులో రాష్ట్రంలో అతి పెద్దచర్చిని నిర్మించారు. నాలుగు సంవత్సరాల పాటు నిర్మాణ పనులు కొనసాగగా 2014, మే 6న చర్చిని ప్రారంభించారు. దాతలు, గ్రామస్తులు అందించిన సహకారంతో చర్చి నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ చర్చిలో ఒకేసారి 500 మందికిపైగా ప్రార్థనలు చేసే అవకాశముంది. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రతీ సంవత్సరం డిసెంబరు 25న ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి దివ్యబలిపూజ, సమర్పణ, సాయంత్రం ప్రదక్షిణలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు క్రిస్మస్ గీతాల ఆలాపన తదితర వాటిని నిర్వహించనున్నారు. చర్చిలో ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు, మేరీమాత, బాలఏసు ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిని విద్యుత్ దీపాల అలంకరణతో తీర్చిదిద్దారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు..

క్రిస్మస్ నేపథ్యంలో 'పునీత ఇన్యాషివారి దేవాలయం' చర్చిలో కొన్ని రోజులుగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నారు. క్రీస్తు జననంతో పాటు బాలఏసు మహిమలు, క్రీస్తును శిలువ వేయడం, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలను నృత్య, నాటక రూపకంలో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: కొంపల్లి సబ్‌స్టేషన్ వార్షిక నిర్వహణ సందర్భంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని ఏఈ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాయల్ పార్క్, అశ్విని కాలనీ, కొంపల్లి గ్రామం, సెంట్రల్ పార్కు, బొబ్బిలి అపార్ట్‌మెంట్స్, దేవీ హోమ్స్, ప్రజయ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్స్, కేవీఆర్ రోడ్డు, గార్డెన్ సొసైటీ, ఉమామహేశ్వర కాలనీ, జయభేరి, బ్యాంక్ కాలనీ, జయభేరి శివాలయం రోడ్డు, శ్రీనివాస కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

జడ్పీహెచ్ఎస్‌లో ఇన్నోవేషన్ ఫెయిర్



ఇన్నోవేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో సోమవారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సృజనాత్మకతకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఇన్నోవేషన్ ఫెయిర్ దోహదపడిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు శిల్ప, సరిత తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు తప్పిన తిప్పలు



సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

- యూటర్న్‌తో తగ్గినదూరం
- సూచికబోర్డు ఏర్పాటు


ట్రాఫిక్ ఆంక్షలు.. వాహనదారులకు తిప్పలు

సాక్షిలో ప్రచురితమైన కథనం

కుత్బుల్లాపూర్ : సుచిత్ర నుంచి కొంపల్లి వెళ్లే దారిలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట జరుగుతున్న ఫ్లై ఓవర్ పనుల నిమిత్తం ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 20న సాక్షి లో 'ట్రాఫిక్ ఆంక్షలు.. వాహనదారులకు తిప్పలు' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి స్పందించారు. అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి ఎన్సీఎల్ కాలనీ ముందు ఉన్న యూటర్న్ మీదుగా అంగడిపేట్, అల్వాల్ హై టెన్షన్ రోడ్డు, సుచిత్రకు వాహనాలు వెళ్లే విధంగా సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ విషయంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

సాక్షి,సిటీబ్యూరో: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం తూముకుంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూరి వజ్రేష్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ పిలుపు మేరకు తూముకుంట నుంచి కలెక్టరేట్ వరకు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు, పురపాలక సంఘాలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల జిల్లా, మండల, పురపాలక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బైరి ప్రశాంత్‌గౌడ్

కుత్బుల్లాపూర్: నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు ఉమామహేశ్వర కాలనీలో 10 రోజుల క్రితం అనారోగ్యంతో శివరాత్రి రవి (34) మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రశాంత్ గౌడ్ తన వంతు సహాయంగా రూ. 10 వేలను సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు వరుణ్ రాజ్, యోగి, వెంకటయ్య, నవీన్, బాలయ్య, ఆంజనేయులు, రాజు, సాంబయ్య, స్వామి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీలో రాణించిన ప్రభుత్వ కళాశాల జట్టు



కబడ్డీ జట్టు సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు

సుభాష్‌నగర్: పైల్వాన్ క్లబ్ స్కూల్ చాంపియన్‌షిప్‌లో కుత్బుల్లాపూర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చందానగర్‌లో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు వీక్షిత్, సుశాంత్, సల్మాన్, జ్ఞానేశ్వర్, హేమంత్‌లను ప్రిన్సిపాల్ నాగేందర్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న శేఖర్ యాదవ్

జగద్గిరిగుట్ట: భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు బూత్ కమిటీలు కృషి చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్, మెంబర్‌షిప్ ఇన్‌చార్జి జీకే శేఖర్ యాదవ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులను నియమించారు. 336 బూత్- రాజమణి, 348- రాఘవయ్య, 349- సంతోష్ యాదవ్, 350-పుల్లారెడ్డి, 354-నవీన్ కుమార్ యాదవ్, 352-అరుణ లను నియమించారు. కార్యక్రమంలో మేడ్చల్ స్పోక్స్ పర్సన్ సురేష్ రెడ్డి, సీనియర్ మహిళా నేత లత, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, శ్రీనివాస్ చారి, రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ స్థలం కబ్జాకు గురువుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం గాజులరామారం సర్కిల్ కార్యాలయం ఎదుట భగత్‌సింగ్‌నగర్ వాసులు ధర్నా నిర్వహించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలంలో కొంత కాలంగా నిర్మాణాలు జరుగుతున్నా సర్కిల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 16 గదులు నిర్మించిన కబ్జాదారులు రూ.50 లక్షలకు ప్లాట్‌ను విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచెర నుంచి పరిరక్షించాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



సాక్షి,సిటీబ్యూరో: వివిధ జిల్లా శాఖలలో ఆన్‌లైన్ పెండింగ్ అప్లికేషన్ల సంఖ్య పెరిగిపోతోందని, వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై కూడా తక్షణమే స్పందించాలన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 94 ఆర్జీలను ఇన్‌చార్జి డీఆర్‌ఓ శంకర్ కుమార్‌తో కలిసి ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం బస్తాల అందజేత



చింతల్: లార్డ్ వెల్ఫేర్ సేవా సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనందించడం అభినందనీయమని సంస్థ వ్యవస్థాపకుడు సురేష్‌కుమార్ అన్నారు. లార్డ్ వెల్ఫేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు తాము సేకరించిన 12 బస్తాల బియ్యాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు లార్డ్ వెల్ఫేర్ సేవా సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న మహిళలు, సంస్థ ట్రెజరర్ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు



సాక్షి,సిటీబ్యూరో: న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. రోజుకో విధంగా వినూత్న పద్ధతిలో నిరసన చేపడుతున్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డుపై వంటావార్పు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ఆయా వేషాధారణలతో ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించాలని పలు ప్రదర్శనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు ఫణి, దేదిప్య, మల్లేష్‌తో సహ ఉద్యోగులు పాల్గొన్నారు.

మరమ్మతులేవి?



సైకప్పు లేకుండా ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్

సుభాష్‌నగర్: సూరారం విలేజ్ లోని మల్లన్న గుడి వద్ద మ్యాన్ హోల్ ధ్వంసమై నెలలు గడుస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారు. ధ్వంసమైన మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. సూరారం విలేజ్ నుంచి బహదూర్‌పల్లి వెళ్లాలంటే ఈ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగిస్తుంటామని, ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ పుష్కరిణి పునరుద్ధరణకు చర్యలు



కార్యక్రమంలో పాల్గొన్న విశాల్‌గౌడ్, ఆలయ కమిటీ

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి పుష్కరిణి పునరుద్ధరణ కార్యక్రమాన్ని సోమవారం శ్రీరామంజనేయ యువజన సంఘం, శ్రీఅన్నపూర్ణ అన్నదాన నిధి, జీవనది ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఠాకూర్ రాజేందర్‌సింగ్, యువనేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు విశాల్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి 150 ఏళ్ల చరిత్ర ఉందని, ఆలయాలు మన సంస్కృతిక నిలయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల మధుసూదనాచార్యులు, తిరుమల కృష్ణ చైతన్య, తిరుమల రామానుజాచార్యులు, జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మీదుర్గ, జాతీయ అధ్యక్షురాలు మంజులా రాణి, కుత్బుల్లాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలతోనే ఉజ్వల భవిష్యత్

ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సుధీర్



టెన్త్ విద్యార్థులకు సూచనలు చేస్తున్న సుధీర్

సుభాష్‌నగర్: మంచి ఆలోచనలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని ప్రముఖ సైకాలజిస్టు, మోటివేషనల్ స్పీకర్ సుధీర్ అన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్స్ అసోసియేషన్, శ్రీ ఆద్య అకాడమీల సంయుక్తంగా పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం గాజులరామారంలోని ఎస్‌జీ కన్వెషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సుధీర్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, మండల విద్యాధికారి జెమిని కుమారిలు హాజరై విద్యార్థుల పలు అంశాలపై అవగాహన కల్పించారు. 55 పాఠశాలలకు చెందిన సుమారు రెండువేల మంది పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో తల్లిదండ్రులు, గురువులు, సైనికులు, రైతులను మాత్రమే నిజమైన హీరోలుగా గుర్తించి గౌరవించాలన్నారు. సినిమాలలో నటించే హీరోలను తమ జీవితాలకు ఆదర్శంగా తీసుకోవద్దని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ కలిపి మూడు సంవత్సరాలు కష్టపడి చదువుతూ భవిష్యత్‌కు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటే ఇక జీవితంలో మిమ్మల్ని ఎవరూ ఆపలేరన్నారు. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ మత్తు పానీయాలు, డ్రగ్స్ మహమ్మారిలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. మండల విద్యాధికారి జెమిని కుమారి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించడం హర్షనీయమని, కుత్బుల్లాపూర్‌లో ఉత్తమ ఫలితాలను సాధించి మేడ్చల్ జిల్లాలోనే ఆదర్శవంతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బీర్రు ఆంజనేయులు, శ్రీఆద్య అకాడమీ కరస్పాండెంట్ విశ్వనాథ్‌చారి, ట్రస్మా చైర్మన్ కోల వెంకటేశ్, అధ్యక్షుడు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, కార్య నిర్వాహక కార్యదర్శి మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: సీసీ కెమెరాలతో నేరాల శాతం తగ్గుతుందని, ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అవసరమైన దగ్గర మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని అగ్రహార్‌నగర్, బడే మజీద్‌లో మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం ప్రతి డివిజన్‌లోని ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయాలలో ఉన్నంత కాలం ప్రజలకు సేవ, వారి అభివృద్ధికి పాటు పడతానన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, మేకల హరినాథ్, కర్రె జంగయ్య, ఖాదీర్, స్టార్ పాయింట్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా అంబేడ్కర్‌పై వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా అవమానపరిచారని, బేషరతుగా దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దమ్మని శ్రవణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, గడ్డం రాజేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, నాయకులు జేమ్స్, శ్రీనివాస్ పాల్గొన్నారు.